ఆ వేళ ఎందుకో మధ్యాహ్నం కాస్సేపు పడుకుని నిద్ర లేస్తూనే పాపం పరంధామయ్యకు మళ్ళా ఒక్కసారి కవిత రాస్తే బాగుండుననిపించింది.

# కవిత

ఆచంట శారదాదేవి



మళ్ళా ఒక్కసారి మరో చిన్న గేయం రాయాలి. మళ్ళా ఒక్కసారి తన పద్యం చిరు అక్షరాలతో చిరు గాలిలో తేలిఆడాలి. మళ్ళా ఒక్కసారి తను కవిగా కవితా రచనతో రూపొందాలి!

ఆవులిస్తూ లేచి అదే ఆలోచిస్తున్నాడు. ఏమిటో ఇన్నాళ్ళకు ఉన్నట్టుండి మళ్ళా ఈ కోరికలు! చూలింత కొక్కెల్లా, నిద్ర పోతున్నాయనుకొన్న భావాలు నిజంగా నిద్రపోవటం లేదు కాబోలు! పైన మట్టి పేరుకున్నా లోపల వెండి తళతళ మంటూనే ఉంటుంది కాబోలు!

ఎప్పుడో చిన్నప్పుడు కవిత రాశాడు. కొన్ని గేయాలు రాశాడు. అవి కొన్ని అచ్చయినాయి. కొన్ని కాలేదు. అయినా అప్పుడు తను దిగులుపడలేదు. వ్రాస్తూనే ఉన్నాడు. అన్నీ అందంగా ఆల్బమ్‌లో వ్రాయికుని ఆఖరున తనపేరు చూసుకుని మురిసిపోతూ వుండేవాడు. ఒక్కొక్క గేయం చదువుకుంటూ ఆనందిస్తూ ఉండేవాడు.

అప్పుడు తనలో ఎప్పుడూ ఏదో తపన రగులుతూ ఉండేది. ఏదో ఉల్లాసం పొంగుతూ ఉండేది. ఏవో ఊహాలు ఉర కలువేస్తూ ఉండేవి. పగలు శాంతి లేదు. రాత్రి నిద్ర లేదు. ఏదో మనసులో ఒకటే రొద. రాస్తేనేకాని తోచేది కాదు. రాయక తప్పేది కాదు. అలా అనుకోకుండా తాను కవి అయ్యాడు.

ఆ రోజుల్లో అప్పుడే తను బి. ఏ. పాసయ్యాడు. వెంటనే ఉద్యోగం దొరక లేదు. తండ్రి సంపాదిస్తున్నాడు కాబట్టి దేనికీ లోపం లేదు. రోజంతా ఖాళీ! ఊరికే బాతాఖానీ వేస్తూ కూర్చోవడం అలవాటు లేదు అంతేక స్నేహితులు ఎక్కువ లేరు. అందుకే ఊరికే పుస్తకాలు చదవడం, ఊరంతా తిరగటం ఖాళీగా ఉన్నప్పుడు కవితలు అల్లడం కాగితాలు నలుపు చెయ్యడం కాలక్షేపం అయింది.



శ్రీమతి ఆచంట శారదాదేవి

పదేళ్ళ క్రిందట తనకు మనమరాలు పుట్టింది. కూతురు కూతురు. ఆ పిల్లకు కవిత అని పేరు పెట్టాడు ముద్దుగా! అలా అయినా తను మరచిపోయిన కవిత జ్ఞాపకం ఉంటుందని కాబోలు! అంతే! ఆ పిల్ల పుట్టినప్పటినుంచి తను అసలు బొత్తిగా కవిత రాయడం మానేశాడు. అప్పటిదాకా ఊహాలో మెదులుతున్న కవిత మాయ మైంది. ఆ కవిత మనమరాలు కవితగా సాకారం దాల్చినట్లనిపించింది. ఆ పాప ముద్దుముచ్చట్లు మనసును దోచేశాయి. కొన్నాళ్ళకి ఎప్పుడో కాని తెలియలేదు.

తను బొత్తిగా గేయాలు రాయడం మానే శాడని! అయినా అప్పుడు ... కలం అందుకోవాలనిపించలేదు. రాయాలనిపించ లేదు. మనసు నిద్దర పోయింది. బద్ధకం ఆవరించింది.

అల్లుడూ కూతురూ అమెరికా వెళుతూ ఆ పాపను ఇక్కడే వదిలేశారు. ఇప్పుడు తనకూ, భార్యకూ ఆ పాప కాలక్షేపం అదే ఆనందం.

ఆ పాప పెద్దదయింది-స్కూలుకు వెళు తోంది. ఆ పాపకు హోమ్‌వర్క్ ఎక్కువ గానే ఉంది. స్నేహితులు ఎక్కువగానే ఉన్నారు. ఇంట్లో ఉండేదే తక్కువ. ఇప్పుడు పరంధామయ్యకు మరోక రకంగా కాలక్షేపం! కవిత ఎప్పుడు ఇంటికి వస్తుందా అని ఎదురుచూడడం!

ఇప్పుడు కాస్త తీరికే! అందుకే కాబోలు పరంధామయ్యకు మళ్ళా కవిత రాస్తే బాగుండును అనిపిస్తోంది.

మొదట్లో అతనిపేరు పి. ఆర్. ధామ్. అసలు పేరుతోనే గేయాలు వ్రాయడం ప్రారంభించాడు. అప్పుడు కావలసినంత తీరిక. చీకూ చింతా లేదు. ప్రపంచం పంచ వన్నెలలో కనిపించింది. ప్రకృతి అందంగా ఆకరించింది. వికసించిన మల్లె తీగె పకపకా నవ్వుతున్నట్లనిపించింది. పండువెన్నెల బంగారంలా తోచింది. పరు




*Hearty Diwali Greetings*



From

**TAJMAHAL GROUP OF HOTELS**

**SECUNDERABAD, HYDERABAD**

**HIGH CLASS VEGETARIAN**

**BOARDING, LODGING & RESTAURANT,**

గెడుతున్న సెలయేరు ప్రియుణ్ని కలుసుకోడానికి తొందరపడుతున్నట్లనిపించింది. ఏ వేపున ఏది చూసినా ఏదో అపురూపమైన వస్తువులా తోచింది. అన్నీ అలౌకికమైన అందంతో ఆహ్వానిస్తున్నట్లనిపించింది. అంతటా ఆనందం నిండినట్లనిపించింది.

ఒక రోజు తండ్రి పిలిచి చెప్పాడు. కలెక్టరాఫీసులో ఉద్యోగం ఖాళీగా ఉంది అప్లికేషన్ ఇచ్చిరమ్మని ఇచ్చి వచ్చాడు. ఉద్యోగం వచ్చింది. పేరు మారింది. పి. ఆర్. ధామ్. ఆఫీసులో పరంధామ్ అయ్యాడు. బ్రతుకు ఒక గాడిలో పడినట్లయింది. ఆఫీసు, ఇల్లూ, అయినా కవిత రాయాలన్న కోర్కెమాత్రం పోలేదు. ఎప్పుడో తీరిక దొరికితే రాయాలనే తాపత్రయం!

పెళ్ళి అయింది. సంసారపు బాధ్యతలూ, బాధలూ రెండూ వచ్చాయి. ఇప్పుడు మనసు పగ్గంలేని గుర్రంలా పరుగులు పెట్టటం లేదు. నిదానంగా సెలయేళ్ళను, మల్లెతోటలను చూడటానికి తీరిక లేదు. ఒక వేళ పరధ్యానంగా చూసినా అవి మునపటిలా పంచ రంగులతో ఆకర్షించటం లేదు.

జీవితం ఉత్సాహంగా ఉండటం లేదు. బ్రతుకు వెలిసిన చీరలా వెలవెలా పోతున్నట్లనిపిస్తున్నది. ఏ మానవుని జీవిత చరిత్ర చూసినా ఏముంది గర్వకారణం. ఆఫీసు, ఇల్లూ, పగలూ, రాత్రి, దినచర్య ఎప్పుడూ ఒక్కటే! ఏదో నిస్పృహ అలముకుంటుంది.

ఎప్పుడో అతని పేరు పరంధామయ్యగా మారింది. బహుశా మనమరాలు పుట్టిన తరువాత కాబోలు! సరిగా గుర్తు లేదు. పేరు ఎప్పుడు మారుతుందో మనసు ఎప్పుడు మారుతుందో, జీవితం ఎప్పుడు ఎలా మలుపు తిరుగుతుందో ఎవరికీ స్పష్టంగా తెలియదు. ఇక్కడే, ఇదే మైలురాయి అని చెప్పడానికి వీలు లేదు. ఎప్పుడో ఉన్నట్టుండి జుట్టు నెరవడం ప్రారంభిస్తుంది. సరిగా ఏ రోజో ఎవరికి గుర్తు ఉంటుంది?

* * *

ఇవ్వాళ మధ్యాహ్నం నిద్ర లేవగానే పరంధామయ్యకు కవిత రాయాలనిపిస్తోంది. మామూలుగా అయితే నిద్రలేవగానే సాయంత్రమైనట్లుంది. కవిత ఇంకా బడినుంచి ఇంటికి వచ్చిందా లేదా అనిపిస్తుంది. మళ్ళా ఒక కవిత రాద్దామనిపించదు.

కామేశ్వరమ్మ కాఫీ తెచ్చి ఇచ్చింది. "కవిత వచ్చిందా" అని అడిగాడు యథాలాపంగా. "ఇంకా రాలేదు" అంది ఆవిడ మళ్ళా తన పనిలోకి తాను వెళ్ళిపోయింది.

పరంధామయ్య వరండా అంచున కూర్చున్నాడు. సూర్యుడు పడమటి దిక్కుకు చేరుకున్నాడు. పొద్దుటి కాంతి లేదు. అస్తమించే ముందు అలా అలా తారట్లాడుతున్నట్లనిపిస్తోంది.

కవిత రాయాలి! మళ్ళా ఒక గేయం రాయాలి! పరంధామయ్య మనస్సు మళ్ళా పరవళ్ళు తొక్కుతోంది! కాని దేన్ని గురించి రాయటం! నిమ్మచెట్టు, నీళ్ళ బావి, కాదేదీ కవిత కనర్హం!

కాని ప్రస్తుతం నిమ్మచెట్టును చూస్తే ఈ వయసులో కవిత్వం రావడం లేదు. ఒక్కటే ఆలోచన వస్తోంది పదేళ్ళయినా ఈ చెట్టు ఒక్క పిందె కూడా వెయ్యలేదేమి అని ఏదో బాధగా ఉంటోంది!

ఏమీ తోచకపోతే ఊరికే సరదాగా ప్రేమ గీతాలు రాయవచ్చు. ప్రస్తుతం ఆ పవం తను మర్చిపోయి చాలా కాలమైనది! కాని ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రేమగీతాలు సముద్ర తరంగాలా ఉప్పొంగుతున్నాయి. సందు సందునా వినిపిస్తున్నాయి!

పోని! జీవితం క్షణ భంగురం! ఈ సత్యాన్ని ఎప్పుడో తెలుసుకున్నాడు. తాత్విక చింతనతో ఏదైనా విరక్తి గీతం రాయవచ్చు. కాని ప్రస్తుతం తనకు ప్రపంచం నిత్యం కాదని తెలిసినా దాన్ని గురించి అంతగా బాధపడవలసిన అవసరం ఏమీ కనిపించటంలేదు.

ఏమీ తోచటం లేదు. మెదడు ఎందుకో మొద్దుబారినట్లుంది. అలలులేని తటాకంలా ఉంది నిర్లిప్తత నిండుకుంది.

కాగితం, కలం డ్రాయరులోంచి తీసి బల్లమీద పెట్టాడు. ఎప్పుడో, ఏదో ఆలోచన వస్తుంది రాయవచ్చు! ఇవ్వాళ ఆఫీసుకు సెలవు పెట్టాడు. అంచేత కాస్త తీరికగా ఉంది. మళ్ళా రేపు మామూలే! మళ్ళా ఆదివారం దాకా ఏ ఊహలూ తనను బాధపెట్టవు. అప్పుడు ఆలోచించవచ్చు!

* * *

'తాతయ్యా' కవిత పిలుస్తోంది! ఎక్కడికో వెళ్ళాలని ముస్తాబయినట్లుంది. పట్టు పరికిణీ, వాలుజడా, అందం తొణికిసలాడుతోంది.

కవిత ఎదుగుతోంది. బాల్యందాటి పరువం సమీపిస్తున్నట్లుంది. అప్పుడే విరిసిన గులాబీలా అందంగా ఉంది.

కవిత దగ్గరగా వచ్చింది.

"తాతయ్యా! నేనొక గేయం రాశాను."

కాగితం చేతి కందించింది.

దాని కళ్ళు మెరుస్తున్నాయి పెదవులు నవ్వుతున్నాయి. దాని మనసు ఉప్పొంగుతోంది.

కాగితం విప్పి చూశాడు

"అంతరంగంలో ఆనందం నిండింది
ఆశల అంచులు అల్లిలాడాయి
కవితా కన్యక కదలింది.

మనసు పాడింది
మోహన రాగం!
పొంగి పొరలింది
జీవనరాగం!"

పరంధామయ్య విస్తుపోయాడు. ఇదేం కవిత్వం? ఏవో వ్యూహాలు కలగా పులగంగా కలిపినట్లుంది!

కాని పరంధామయ్య నవ్వలేదు. వెక్కిరించలేదు.

పాపం దానికి ఇప్పుడే ఊహలు మొలకెత్తుతున్నాయి! ఇప్పుడే ప్రపంచం పంచవన్నెలలో కనిపిస్తోంది. ఇప్పుడే ఏదో రాయాలన్న తపన కదులుతోంది. అంతే!

అది ఇంక ఏదో రాస్తూనే ఉంటుంది. కాగితం నలుపు చేస్తూనే ఉంటుంది. ఎందాకా? ఏమో!

తూర్పు, పడమర! ఉదయం, సంధ్య! ఈ జీవిత క్రమం ఇలానే సాగుతుంది.

ఒకరి కన్నులలో కలలు చెదురు మదురుగా అలుముకొంటాయి. మరొకరి కన్నులలో నిర్లిప్తత నిండుగా అలుముకొంటుంది. ఒక మనసు నిదురపోతుంది. మరొక మనసు మేల్కొంటుంది. ఒక జీవితం ప్రయాణం ప్రారంభిస్తుంది. మరొక జీవితం విశ్రాంతి గది వెతుక్కుంటూ ఉంటుంది. తాత, మనుమరాలు! ఈ అనుబంధం ఎడతెగనిది! ఇది ఇలానే సాగుతుంది.

పరంధామయ్య కవితను గట్టిగా కావిలించుకున్నాడు, ముద్దు పెట్టుకున్నాడు, తల నిమిరాడు, ఆశీర్వదించాడు.

* * *

మూడురోజులుగా తను బల్లమీదపెట్టిన కాగితం, కలం అలానే ఉన్నాయి. దుమ్ము కూడా దులపలేదు. అవి తీసి మళ్లా డ్రాయరులో పడేశాడు.

కవిత కలకలా నవ్వుతో కన్నుల పండుగగా ఇల్లంతా కలయతిరుగుతోంది. అలానే ఆనందంతో ఆ పిలను చూస్తూ కూర్చున్నాడు.

ఇంక తను కవిత వ్రాయలేదు. కాని తన మనమరాలు రాస్తుంది. అది చాలు!

అతని మనసు తృప్తితో నిండింది.